మౌలిక వసతుల కల్పనే లక్ష్యం..

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్, కార్పొరేటర్లు

బోడుప్పల్,నవంబర్ 7 : మౌలిక వసతుల కల్పనే తమ లక్ష్యమని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. గురువారం నగర పరిధిలోని 21, 22వ డివిజన్ పరిధిలో రూ. 56 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ, సీసీరోడ్డు పనులను ఆయన స్థానిక కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు సుమన్‌నాయక్, మహేశ్వరీకృపాసాగర్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయించాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకులు రహమ్మత్ అలీ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకులు రహమ్మత్ అలీ, పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 7 : పద్దెనిమిదేండ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు రహమ్మత్ అలీ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల పరిశీలకులు పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు, చిన్న చిన్న అంశాలను దృష్టిలో పెట్టుకొని జాతీయ ఎన్నికల కమిషన్ అవసరమైన మార్గదర్శకాలను రూపొందిస్తుందన్నారు. దశల వారీగా ఈ స్పెషల్ సమ్మరీ రివిజన్‌ను నిర్వహించను న్నట్లు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2,435 పోలింగ్ బూత్‌లు ఉన్నప్పటికి ఓటింగ్ శాతం తక్కువగా ఉన్నదని, ఈ శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సమన్వయంతో కృషిచేస్తే ఓటింగ్ శాతం పెరుగుతుందని సూచించారు. డెత్ కేసులను ఎప్పటికప్పుడు సవరించేలా సంబంధిత ఫారాలైన 6, 6ఎ, 7ఎ, 8లలో నమోదు చేసుకునేలా బీఎల్‌ఏలు, బీఎల్‌వోలు ప్రజలకు అవగాహన కల్పించి ఓటరు జాబితాను అప్‌డేట్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 6,642 నమోదులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో కలెక్టర్ గౌతమ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఆర్‌డీఓ సైదులు, స్వీప్ అధికారి సాంబశివ రావు, వివిధ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, నవంబర్ 7 : ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం డివిజన్‌లో గురువారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీల్లో సమస్యలను పరిశీలించారు. కాలనీలో డ్రైనేజీ సమస్యలను పరిశీలించి, తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యూజీడీ సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజల కోసం పనిచేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి, పనులు చేస్తున్నామని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తాం..

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి

అల్వాల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి

మల్కాజిగిరి, నవంబర్ 7: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి అన్నారు. గురువారం అల్వాల్‌లో నిర్మాణంలో ఉన్న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించి, అన్ని పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి, మెడికల్ ఆఫీసర్ యాకందర్ రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలని ధర్నా

రామంతాపూర్,నవంబర్ 7 : డివిజన్‌లోని తారకరామాకాలనీ-శ్రీనగర్ కాలనీ రోడ్డు అధ్వానంగా మారిందని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, స్థానికులు గురువారం ధర్నా చేపట్టారు. కాలనీలో రోడ్డు తవ్వి నీటి సమస్యను పరిష్కరించి రోడ్డును అలాగే వదిలేశారన్నారు. తవ్విన రోడ్డును బాగుచేయడంలో అధికారులు చొరవ చూపడంలేదని, ఇప్పటికైనా రోడ్డు బాగు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు సత్యనారాయణ, వినోద్, అనిల్‌మాధవ్, శ్రీను, చంద్రకాంత్, గోపాల్, రామకృష్ణ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నేరేడ్‌మెట్, నవంబర్ 7: వాజ్‌పెయినగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగింపు ఉన్నందున శుక్రవారం వాజ్‌పెయినగర్, హిల్ కాలనీ, కాకతీయనగర్, వెంకటేశ్వరనగర్, గీతానగర్ తదితర ప్రాంతాలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 3:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నేరేడ్‌మెట్ ఏఏఈ లత ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఏఈ కోరారు.

ఘట్‌కేసర్ రైల్వే వంతెన నిర్మాణం పూర్తి చేయండి

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 7 : ఘట్‌కేసర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెనను వెంటనే పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ ఎస్ఈ వెంకటేశ్వర్లుకి గురువారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యుడు ఎండీ సీరాజ్ వినతిపత్రం అందజేశారు. రైల్వే వంతెన పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన ఎస్ఈ వంతెన కంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. ఆయన వెంట నవీన్, వెంకటేశ్వరచారి ఉన్నారు.

విలీన గ్రామాల్లో పారిశుధ్య పనుల పరిశీలన

కొర్రెముల్ రోడ్డులో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, నవంబర్ 7 : పోచారం మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో గురువారం చైర్మన్ కొండల్‌రెడ్డి పర్యటించారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వెంకటాపురం, చౌదరిగూడ, కొర్రెముల్, సాదత్‌అలీగూడ, ప్రతాపసింగారం, కాచివాని సింగారం, ముత్వేలిగూడ గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వీసీకి సన్మానం

వీసీ సూర్యధనుంజయ్‌తో బీఆర్ఎస్, రజక సంఘం నాయకులు

రామంతాపూర్, నవంబర్ 2 : వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యధనుంజయ్‌ను బీఆర్ఎస్, రజక సేవా సమితి నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడం అభినందనీయమన్నారు. దొరలపై పోరాటం చేసిన ఐలమ్మ ఆశయాల సాధనకు అంతా కృషి చేయాల్సిన అవసరముందన్నారు. యూనివర్సిటీలో ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ ధోబీ రిజర్వేషన్ సంఘ ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరి,తెలంగాణ రజక సేవాసమితి అధ్యక్షుడు గోపిరజక,అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగ్‌రావు,బీఆర్ఎస్ నేత కేతూరి రవి,తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజున పేదలకు ఆర్థిక సాయం

పాతరామంతాపూర్‌లో పేదలకు ఆర్థిక సాయం అందజేస్తున్న గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు

రామంతాపూర్, నవంబర్ 7 : ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంధం నాగేశ్వర్‌రావు గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా డివిజన్‌లోని పలువురు పేదలకు ఆర్థిక సాయం అందజేశారు. పాత రామంతాపూర్‌కు చెందిన రాముకు రూ. 10వేలు, విజయ్‌కు రూ. 10 వేలు, బాలాజీనగర్‌కు చెందిన స్వరూప కుమారుడికి రూ. 20వేలు, నేతాజీనగర్‌కు చెందిన ప్రకాశ్‌కు రూ. 10 వేలను ఆయన మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, నర్సింగ్‌రావు, శంకర్,చాంద్‌పాష, శ్రీకాంత్‌గౌడ్, శంబుసాయి, రమేశ్, శ్రీనివాస్, రవి, బాబురావు, రాజు, శీను, తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానలతో పేదలకు మెరుగైన వైదం

ఘట్‌కేసర్ బస్తీ దవాఖానలో రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య యాదవ్

ఘట్‌కేసర్, నవంబర్ 7 : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసినట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య యాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో గురువారం చైర్‌పర్సన్ పర్యటించి స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తడిచెత్త-పొడిచెత్తను వేర్వేరుగా వేయాలని సూచించారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసిందని, వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాషా, లక్ష్మి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

అదృశ్యమైన రాము (ఫైల్)

మల్కాజిగిరి, నవంబర్ 7: తెలిసిన వ్యక్తి మోసం చేశాడని ఆందోళనతో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కొండల్ కథనం ప్రకారం.. స్థానిక పీపీఎన్ కాలనీకి చెందిన రాము(51) ఇంటీరియర్ డిజైనర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాము రాత్రి వరకు ఇంటికి రాలేదు. అయితే తనను ఒక వ్యక్తి మోసం చేశాడని భార్యకు మెసేజ్ చేశాడు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దాంతో ఆందోళన చెందిన రాము భార్య, కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ దొరకలేదు. అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్ పరిధిలో బాలుడు..

అదృశ్యమైన అరవింద్ (ఫైల్)

మేడ్చల్, నవంబర్ 7 : మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడు అదృశ్యమైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... మేడ్చల్ మండలం గౌడవెల్లికి చెందిన కుమ్మరి అరవింద్(15) ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. మతిస్థిమితం సరిగ్గాలేకపోవడంతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గత నెల 26న స్కూల్‌కి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెకుముఖి టాలెంట్ టెస్ట్

చర్లపల్లి, నవంబర్ 7 : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు జనవిజ్ఞాన వేదిక చెకుముఖి టాలెంట్ టెస్ట్ దోహదపడుతుందని జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్ని, కాప్రా మండల కార్యదర్శి ప్రభాకర్ పేర్కొన్నారు. కుషాయిగూడ, చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం చెకుముఖి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని రాణించాలన్నారు.

కులగణన సక్రమంగా నిర్వహించాలి

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

వెంకటాపురంలో కులగణన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 7: కులగణనను సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సంబంధిత సిబ్బందికి సూచించారు. గురువారం అల్వాల్ డివిజన్ వెంకటాపురంలో కులగణన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. ఎన్యూమరేటర్లు అన్ని ఇండ్లకు వెళ్లి ముందస్తుగా స్టిక్కర్లు అంటించాలన్నారు. కులగణన వివరాలను సేకరించేటప్పుడు ఇండ్ల యజమానులపై ఒత్తిడి తీసుకురావద్దని, వారు చెప్పిన వివరాలను పొందుపరచాలని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం వద్ద అన్ని వర్గాలు, కులాలు, కుటుంబాల పూర్తి వివరాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, పెంటారెడ్డి, చరణ్‌గిరి, సురేందర్‌రెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.

కాప్రా సర్కిల్‌లో..

కాప్రా: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం కాప్రా సర్కిల్‌లో ముమ్మరంగా కొనసాగుతున్నది. మొదటి రెండు రోజులు కుటుంబాలను గుర్తించి ఇండ్ల ముందు ఇంటి యజమాని పేరుతో స్టిక్కర్లను అతికించే కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం హెచ్‌బీ కాలనీలో మహిళా ఎన్యూమరేటర్లు ఇంటి ముందు స్టిక్కర్లను అతికించారు.

ప్రజలు సహకరించాలి : కార్పొరేటర్

ఉప్పల్ : కులగణనకు ప్రజలు సహకరించాలని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్‌లో కులగణన సర్వేను గురువారం ప్రారంభించారు. డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులుతో కలిసి భరత్‌నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ సర్వేను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. సర్వేకు వచ్చేవారికి సహకరించి, తగిన వివరాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం. పరమేశ్వర్‌రెడ్డి, జగన్నాథ్, రామకృష్ణ, అరుణ్, ప్రభాకర్‌రెడ్డి, లూకాస్, అనిల్‌కుమార్, భాస్కర్, విఠల్, నవీన్,లక్ష్మణ్, పుష్పలత పాల్గొన్నారు.

రేషన్ బియ్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 7 : అంకుషాపూర్‌లో రేషన్ బియ్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాలు.. యాదాద్రి జిల్లా మల్కాపురానికి చెందిన భుక్యా నర్సింహ (37) ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి అంకుషాపూర్ ఫ్లాట్‌ఫామ్ వద్ద రేషన్ బియ్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడు నర్సింహను అరెస్టు చేసి క్వింటాల్ రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని ఘట్‌కేసర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వైభవంగా సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణం

కీసర, నవంబర్ 7; కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రమణ్య స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. కార్తిక మాసోత్సవంలో భాగంగా గురువారం షష్ఠి కావడంతో ఆలయ ప్రాంగణంలో వేదపండితులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణాన్ని వైభోపేతంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఘట్‌కేసర్, నవంబర్ 7 : అన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గ ప్రత్యేక నిధులు రూ. 30లక్షలతో పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ ఎన్‌టీపీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, పోచారం వైస్ ప్రెసిడెంట్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి : కార్పొరేటర్

చర్లపల్లి చెరువు వద్ద ఛఠ్‌పూజలో పాల్గొన్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు

ఛఠ్ పూజలో పాల్గొన్న వినాయకనగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తదితరులు

చర్లపల్లి, నవంబర్ 7 : డివిజన్ పరిధిలోని అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. చర్లపల్లి చెరువు వద్ద బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌ఘడ్, గుజరాత్, రాంచీ,ఢిల్లీతో పాటు ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు నిర్వహించిన ఛఠ్ పూజలో కార్పొరేటర్ శ్రీదేవి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాచీన పండుగల్లో ఒకటైన ఛఠ్‌పూజకు చెరువు వద్ద అన్ని సౌకర్యాలు కల్పించామని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరక్టర్ బాల్‌రెడ్డి, ఛఠ్‌పూజ కమిటీ సభ్యులు అజయ్‌కుమార్ సింగ్, రాంవిజయ్ యాదవ్, అంజిషా, ఇంద్రజిత్‌సింగ్, కృష్ణా సింగ్, సంజయ్‌రావు, మనీష్‌సింగ్, జితేందర్‌కుమార్, విజయ్‌కుమార్, ఉదయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు ప్రభుగౌడ్, రాజుగౌడ్, నవనీత, సత్తెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఛఠ్ పూజలో పాల్గొన్న వినాయకనగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

నేరేడ్‌మెట్ : వినాయకనగర్ డివిజన్ లల్వానినగర్ బేబీ పాండ్‌లో గురువారం నిర్వహించిన బీహార్ ఛఠ్ పూజ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొని పూజలు చేశారు. బీహార్ సంయోగ్ సమితి అండ్ మహిళా అసోసియేషన్ అధ్యక్షులు బినయ్ యాదవ్, మనోజ్ యాదవ్, బివాస్ జా, దీపక్‌యాదవ్ పాల్గొన్నారు.

కీసరలో సదర్ ఉత్సవాలు

కీసర, నవంబర్ 7 : మండల కేంద్రంలో సదర్ ఉత్సవాలను యాదవ సంఘం యువకులు ఉత్సాహంగా నిర్వహించారు. సుమారు 200 మంది పోటాపోటీగా దున్నపోతులను అలంకరించి తెచ్చి కీసరలోని నాలుగు మార్గాలో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పలువురు నేతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కీసర మాజీ ఎంపీటీసీలు బెలిదే రమేశ్‌గుప్తా, జంగయ్యయాదవ్, రామిడి విజయ్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌గుప్తా, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 7: ఓయూ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్ డబ్ల్యూ తదితర అన్ని కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 14వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

జవహర్‌నగర్, నవంబర్ 7: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు సీఆర్‌పీఎఫ్ విద్యార్థి ఎంపికవ్వడం అభినందనీయమని సీఆర్‌పీఎఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ డి. అపర్ణ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో 14వ జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో బాలుర విభాగంలో కూరపాటి వసంత్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం పా